
రొమ్ము క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ అరుణ

ఆత్మవిశ్వాసం, మనోధైర్యమే క్యాన్సర్‌కు మందు

మన్సూరాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా వైద్యుల సలహాలు పాటించడంతో పాటు ముఖ్యంగా ఆత్మవిశ్వాసం, మనోధైర్యంతోనే సమాజాన్ని పట్టిపీడిస్తున్న క్యాన్సర్ భూతాన్ని తరిమికొట్టగలమని బీజేపీ సీనియర్ నాయకుడు సామ రంగారెడ్డి, నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని జైపురికాలనీ బ్లైండ్స్‌కాలనీలో డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి నేతృత్వంలో సోమవారం రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత వైద్య శిబిరం, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన సామ రంగారెడ్డి, చింతల అరుణ విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించగా పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు, వైద్య సిబ్బంది, కాలనీవాసులు సరస్వతి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


నూతన కమిటీ సభ్యులను అభినందిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

సచివాలయనగర్ సంక్షేమ సంఘం కమిటీ ఏకగ్రీవం

వనస్థలిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయ నగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా పి.సాంబశివరావు, ప్రధాన కార్యదర్శిగా జి.బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా జి.గోపాల్‌రెడ్డి, ఎస్.ఆంజనేయులు, కార్యదర్శులుగా సీ.హెచ్.సూర్యనారాయణ, పి.శ్రీధర్‌కుమార్, హరీష్, కోశాధికారిగా ఆలేటి రవికుమార్, సభ్యులుగా టి.రవికుమార్, ఇ.నర్సింహారెడ్డి, చందు, వి.హరగోపాల్, పి.సీతారామశాస్త్రి, సి.సుధీర్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు వి.బాబురావు, శివాజీ తెలిపారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఘనంగా సన్మానించారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ ఎన్నికకు కృషి చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహించొద్దు : కార్పొరేటర్

సైదాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం క్రాంతినగర్ బస్తీ దవాఖానాను సందర్శించి రికార్డులను పరిశీలించారు.


రికార్డులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణారెడ్డి

సిబ్బంది సమయపాలన, రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బస్తీ వాసులు భానుకిరణ్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించండి

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ గౌరెల్లి గ్రామం సర్వే నంబర్ 238లోని ప్రభుత్వ భూమిలో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరుతూ దళిత యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు గ్యార నరసింహ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. సదరు సర్వే నంబర్‌లోని ప్రభుత్వ భూమిని వెంటనే సర్వేచేసి ఇళ్లులేని పేదలకు 120గజాల చొప్పున ఇంటి స్థలాలను కేటాయించాలని కోరారు. గ్రామంలో చాలామంది నిరుపేదలు ముగ్గురు, నలుగురు అన్నదమ్ములు కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారని తెలిపారు. మరి కొందరు ఇళ్లులేక కిరాయి ఇళ్లలో నివాసం ఉంటున్నారని చెప్పారు. గ్రామంలోని పేదల సమస్యను గుర్తించి వెంటనే ఇళ్ల స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.


ప్రజావాణిలో అధికారికి వినతిపత్రం ఇస్తున్న నర్సింహ


క్యాంపస్ ప్లేస్‌మెంట్ కరపత్రాలు విడుదలచేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

22న 'స్ఫూర్తి'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

సరూర్‌నగర్ : బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 22వ తేదీన టెక్ మహీంద్రా సంస్థతో కలిసి తక్షణ నియామకాల నిమిత్తం పూల్ క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు కళాశాల కార్యదర్శి ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ గిరిధర్ తెలిపారు. 2023, 2024, 2025 విద్యా సంవత్సరాల్లో పట్టభద్రులైన అన్ని విభాగాల విద్యార్థులు ఈ డ్రైవ్‌లో పాల్గొనవచ్చునని వారు పేర్కొన్నారు. విద్యార్థులు తమ అర్హతకు సంబంధించిన అన్ని సర్టిఫికెట్లు, గుర్తింపు పత్రాలు, రెండు పీపీ సైజ్ ఫొటోలు తీసుకురావాల్సి ఉంటుందని వారు తెలిపారు. 22న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు డ్రైవ్ ఉంటుందని, ఇతర వివరాలకు డాక్టర్ హేమనాథ్ (9121001921), డాక్టర్ లక్ష్మీనాథ్(9866333954)లను సంప్రదించాలని సూచించారు.

సైన్యానికి సంఘీభావంగా తిరంగా ర్యాలీ

సైదాబాద్, మే 19(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని పురస్కరించుకుని భారత త్రివిధ దళ సైన్యానికి సంఘీభావంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రజలు జాతీయ పతాకాన్ని చేతబట్టి, సైన్యం పోరాట చిత్రాల ప్లకార్డులు ప్రదర్శిస్తూ నడుస్తూ తిరంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ సింగరేణికాలనీ చౌరస్తా నుంచి చంపాపేట మీదుగా ఐఎస్‌సదన్‌చౌరస్తా వరకు కొనసాగింది. ఉగ్రవాదులు కాశ్మీర్ పహల్గాంలో అమాయక పర్యాటకుల ప్రాణాలు తీయడం పిరికితనమని కార్పొరేటర్లు జంగం శ్వేతామధుకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి అన్నారు. ర్యాలీలో జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, రాణిరుద్రమ, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు, వీహెచ్‌పీ నేత సుందర్ రెడ్డి, గోరక్ష అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి పాల్గొన్నారు.


జాతీయ పతాకాన్ని చేతబట్టి ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

స్విమ్మింగ్‌లో వర్షిత్, జీవికకు చెరో ఐదు స్వర్ణాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జిల్లా సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో స్విమ్మర్లు డి.వర్షిత్, జీవిక చెరో ఐదు పసిడి పతకాలు కొల్లగొట్టారు. రెండ్రోజులు పాటు బౌరంపేటలోని జియాన్ స్పోర్ట్స్ అకాడమీలో జరిగిన ఈ పోటీలు సోమవారం ముగిశాయి. వర్షిత్ 200 మీటర్ల ఫ్రీస్టయిల్, బ్యాక్ స్ట్రోక్, బటర్‌ఫ్లయ్, మెడ్లేలో స్వర్ణాలు, 400 మీ., మెడ్లేలో పసిడి పతకాలు నెగ్గాడు. జీవిక 400, 800 మీ., ఫ్రీస్టయిల్‌లో స్వర్ణాలు, 50, 200 మీ., బ్యాక్‌స్ట్రోక్‌లో స్వర్ణాలు, 50 మీ., బటర్‌ఫ్లయ్‌లో పసిడి పతకాలు సొంతం చేసుకుంది. వీరిద్దరిని కోచ్ జాన్ సిద్ధిఖీ అభినందించారు.

మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ముగింపు దశకు మిర్చి కొనుగోళ్లు

తగ్గిన మార్కెట్ ఆదాయం

ఓల్డ్‌మలక్‌పేట, మే 19(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి పంట కొనుగోళ్లు ముగింపు దశకు చేరుకున్నాయి. నాలుగు నెలల నుంచి మార్కెట్‌లో పెద్ద ఎత్తున మిర్చిపంట కొనుగోళ్లు కొనసాగాయి. సీజన్ ముగుస్తుండడంతో వారం రోజులనుంచి మార్కెట్‌కు పంట రాబడి తగ్గిపోయింది. ప్రస్తుతం రోజుకు 400బస్తాల పంట మాత్రమే మార్కెట్‌కు వస్తుంది. వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతుండడంతో మిర్చి మార్కెట్ త్వరలోనే ముగియనుంది. మార్కెట్‌లో అధికారులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టి పారదర్శకంగా మిర్చి కొనుగోళ్లు చేపట్టారు. ఈ సంవత్సరం మిర్చి రైతులకు ధర విషయంలో నిరాశే ఎదురైంది. మిర్చి ధర గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి బాగా తగ్గింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.11వేలు మాత్రమే అమ్ముడుపోతుంది. మార్కెట్ ప్రారంభ దశలో క్వింటా ధర రూ.13వేలు పలుకగా రానురాను ధర తగ్గుతూ వస్తుంది. ధర పెరుగుతదని ఆశతో ఎదురుచూసిన రైతులకు నిరాశే ఎదురైంది. రాష్ట్రంలో అన్ని మార్కెట్లలో ఇదే పరిస్థితి నెలకొంది.

త్వరలోనే మిర్చి కొనుగోళ్లు ముగుస్తాయి



మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు విజయవంతంగా కొనసాగాయి. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. పారదర్శకంగా కొనుగోళ్లు జరిగాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషిచేశాం. త్వరలోనే మిర్చి మార్కెట్ ముగుస్తుంది.
- దామోదర్, మార్కెట్ అధికారి

తగ్గిన ఆదాయం..

మిర్చి కొనుగోళ్ల ద్వారా మార్కెట్‌కు వచ్చే ఆదాయం నిరాశపర్చింది. అనుకున్న మేర ఆదాయం రాలేదు. రైతుల వద్ద ట్రేడర్లు పంట కొన్నందుకు వందకు ఒక రూపాయి మార్కెట్‌కు కమీషన్ చెల్లించాలి. అలా వచ్చిందే మార్కెట్ ఆదాయం. గత సంవత్సరం ఆదాయంతో పోల్చుకుంటే ఈసారి మార్కెట్ ఆదాయం తగ్గింది. గత సంవత్సరం రూ.3 కోట్ల పైచిలుకు ఆదాయం రాగా ఈసారి రూ.2కోట్ల42లక్షలు మాత్రమే వచ్చింది. ఆదాయం తగ్గడానికి కారణం మిర్చి పంటకు ఈ సంవత్సరం రేటు తగ్గడం గత సంవత్సరం క్వింటా ధర రూ.20వేలు పలుకగా ఈసారి రూ.11వేలు మించి అమ్ముడుపోలేదు. దీంతో మార్కెట్‌కు వచ్చే ఆదాయం కూడా తగ్గిందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ సంవత్సరం రెండున్నర లక్షల క్వింటాళ్ల మిర్చిపంట మార్కెట్‌కు రాగా రూ.24కోట్ల వ్యాపారం జరిగింది.


మిర్చి పంట

గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడతాం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్కేవేస్ కాలనీలోని గ్రంథాలయ గ్రౌండ్‌లో నూతన గ్రంథాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగిన నేపథ్యంలో రాబోయే రెండు, మూడు రోజుల్లోనే ఆ పనులు ప్రారంభం కానున్నాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్‌లోని తెలంగాణ గ్రంథాలయ పరిషత్ కార్యాలయంలో పౌర గ్రంథాలయశాఖ సంచాలకులు పి.వి శ్రీహరిని ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేక సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుతం గ్రంథాలయ నిర్మాణపు పనుల్లో భాగంగా గ్రౌండ్ లేవల్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో భవిష్యత్‌లో గ్రంథాలయంపైన మొదటి అంతస్థులో సీనియర్ సిటిజన్స్ భవనం, రెండవ అంతస్థులో కాలనీ సంక్షేమ సంఘ భవనం, మూడో అంతస్థులో మహిళ భవనం, నాల్గవ అంతస్థులో రంగస్థల కళాకారుల కోసం హైసీలింగ్‌తో నిర్మాణం చేపట్టే విధంగా స్టీల్ డిజైన్ చేయాలని గతంలో తాను ప్రణాళికను రూపొందించినట్లు పి.వి.శ్రీహరికి వివరించారు. దీంతో తన ప్రణాళిక మేరకు అందుకు అనుగుణంగా గ్రంథాలయ పనులు మొదలుపెడుతామని సంబంధిత అధికారులు తెలిపారన్నారు. అదేవిధంగా గ్రంథాలయ నిర్మాణానికి మరిన్ని నిధులతో పైన నిర్మించే అదనపు అంతస్థుల నిర్మాణం కోసం సీఎం వద్దకు వెళ్లి నిధులు తీసుకవస్తానని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గ్రంథాలయ సంచాలకులు పి.వి శ్రీహరితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన టిప్పర్

ఓఆర్ఆర్‌పై పాల ట్యాంకర్‌ను ఢీకొట్టిన టిప్పర్

- టిప్పర్ డ్రైవర్ మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 19(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్‌పై ఆగి ఉన్న పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో టిప్పర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెస్ట్‌బెంగాల్ రాష్ట్రంలోని హౌరా జిల్లా గొబెరియా గ్రామానికి చెందిన ఎండీ యూ అలీ(40) యాదాద్రి భువనగిరి జిల్లా పిల్లాయిపల్లిలో నివాసం ఉంటూ బీఎంఆర్ క్రషర్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కాగా సోమవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో టీజీ07టీ1329 టిప్పర్‌తో పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ టోల్ నుంచి ఘట్‌కేసర్ వైపుకు వెళ్తున్నాడు. టోల్ ప్లాజా దాటిన సుమారు 200మీటర్ల దూరంలో తిరుమల కంపెనీకి చెందిన పాల ట్యాంకర్‌ను డ్రైవర్ నిర్లక్ష్యంగా రోడ్డుపై ఆపాడు. ఆగిఉన్న ట్యాంకర్‌ను గమనించని టిప్పర్ డ్రైవర్ అలీ పాల ట్యాంకర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ఈ క్రమంలో టిప్పర్ క్యాబిన్‌లో అలీ ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో మృతిచెందిన డ్రైవర్ అలీ

రసాయన ఎరువులు తగ్గించి.. పంట ఆరోగ్యం కాపాడుకోండి

వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ బాలాజీనాయక్ రైతులకు సూచన

అబ్దుల్లాపూర్‌మెట్, మే 19(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువులు తగ్గించి పంటల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌వీటీ. బాలాజీనాయక్ రైతులకు సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో సోమవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాస్త్రవేత్త డాక్టర్ ఆర్‌వీటీ. బాలాజీనాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలకు యూరియా వాడకం తగ్గించడం ద్వారా రైతులకు సాగు ఖర్చులు కూడా తగ్గించుకోవచ్చన్నారు. మోతాదులో మాత్రమే రసాయన ఎరువులను వాడాలని సూచించారు. వ్యవసాయానికి సంబంధించి ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన రసీదులను రైతులు భద్రపరుచుకోవాలని చెప్పారు. అకాల సమయంలో జరిగిన పంటనష్టం పరిహారం పొందేందుకు అవి ఉపయోగపడుతాయన్నారు. మండల వ్యవసాయ అధికారి పల్లవి మాట్లాడుతూ రసాయన ఎరువులకు బదులుగా సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వినియోగించాలన్నారు. రైతులు పంటలతో పాటు చెట్ల పెంపకంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో అగ్రోనమీ పీహెచ్‌డీ స్కాలర్స్ సాయిరామ్, వెంకటేష్, మండల ఏఈవో రఘుపతి, రైతులు భూపాల్ రెడ్డి, నరసింహ, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రైతు అవగాహన సదస్సులో శాస్త్రవేత్త బాలాజీనాయక్, రైతులు

అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ట్రాన్స్ జెండర్లు అరెస్టు

హయత్‌నగర్, మే 19(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో నిలబడి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న ఇద్దరు ట్రాన్స్ జెండర్లను హయత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం హయత్‌నగర్ తహసీల్దార్ ముందు వారిని బైండోవర్ చేశారు. దీంతో తహసీల్దార్ ట్రాన్స్ జెండర్లకు రూ.50వేల సొంత పూచికత్తుపై వదిలిపెట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. చెరుకు ఆశ, వాంకోతు మౌనిక అనే ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు ఆదివారం రాత్రి 11గంటల సమయంలో హయత్‌నగర్‌లో హైకోర్టు కాలనీకి ఎదురుగా అనన్య రిసార్టు ముందు నిలబడి న్యూసెన్స్ చేస్తున్నారు. దీంతో స్థానికుల నుంచి సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇద్దరిని ఆదుపులోకి తీసుకున్నారు. పోలీసులు సోమవారం ట్రాన్స్‌జెండర్లను హయత్‌నగర్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. సంవత్సరంలో మరో సారి ఇలాంటి తప్పు చేస్తే రూ.50వేల జరిమానా లేదా జైలు శిక్ష విధిస్తామని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


అరెస్టు అయిన ట్రాన్స్ జెండర్లు

సరూర్‌నగర్ పాత పోస్టాఫీస్ రోడ్డును విస్తరించండి

- జెడ్సీకి కార్పొరేటర్ల వినతి

ఎల్‌బీనగర్, మే 19(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రాకపోకలు విపరీతంగా పెరిగిన దృష్ట్యా సరూర్‌నగర్ పాత పోస్ట్‌ఆఫీస్ రోడ్డును విస్తరించాలని లింగోజిగూడ కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్ జెడ్సీని కోరారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను కలిసిన వారు రోడ్డు విస్తరణపై చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ దాదాపు 15 సంవత్సరాలుగా సరూర్‌నగర్ పాత పోస్ట్‌ఆఫీస్ రోడ్డు విస్తరణ ప్రతిపాదన పెండింగ్‌లోనే ఉన్నదన్నారు. తక్షణమే రోడ్డు విస్తరణ చేపట్టాలని వారు కోరారు. దీంతో ట్రాఫిక్ ఇక్కట్లు తొలగిపోవడంతో పాటు ఇక్కడి ప్రజలు రాకపోకలు సాఫీగా సాగిస్తారన్నారు. వాణిజ్యపరంగా కూడా వృద్ధిచెందుతుందన్నారు. జెడ్సీ సానుకూలంగా స్పందించారని త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు చెప్పారు.


జెడ్సీ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్లు రాజశేఖర్‌రెడ్డి, శ్రీవాణిఅంజన్

నాదర్‌గుల్‌లోని లింగమయ్యగుట్టపై అగ్ని గుండాలు

- ఆకట్టుకున్న రేణుక ఎల్లమ్మ ఒగ్గు కథ

సరూర్‌నగర్, మే 19(ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్‌లోని లింగమయ్య గుట్టపై జరుగుతున్న జాతరలో భాగంగా సోమవారం గుట్టపై ఒగ్గు కళాకారులు శ్రీరేణుక ఎల్లమ్మ, పరశురాముడు తదితర వేషాలు వేసి ఒగ్గు కథ ప్రదర్శించారు. ఎల్లమ్మ జీవిత చరిత్రను వివరిస్తూ సాగిన ఈ కథను భక్తులు ఆసక్తిగా తిలకించారు. అనంతరం లింగస్వామితో పాటు గుట్ట పైభాగాన గల బండరాళ్ల సందులో వెలిసిన లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాదర్‌గుల్ మాజీ ఎంపీటీసీ కటికరెడ్డి శ్రీరాంరెడ్డి స్వామివారిని దర్శించుకోగా నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మండపం ఎదురుగా నిర్వహించిన అగ్నిగుండాలు కార్యక్రమంలో భక్తులు, శివసత్తులు ఉత్సాహంగా పాల్గొని నిప్పులపై నడిచారు. మంగళవారంతో లింగస్వామి జాతర ముగుస్తుందని శ్రీగోపాలకృష్ణ యాదవ సంఘం ప్రతినిధులు తెలిపారు.


అగ్నిగుండాల్లో నడుస్తున్న భక్తులు

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, మే 19 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొంపల్లి ఎన్‌సీఎల్ కాలనీలోని ప్లెజెంట్ వాలీ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న పొన్నూరి వెంకట రామ్మోహన్‌రావు (55) వ్యాపారం చేస్తుంటాడు. రోజూ మాదిరిగానే ఉదయం 9 గంటలకు వాచ్‌మన్ జయసూర్య డోర్‌కొట్టిన సమయంలో లోపలి నుంచి దుర్వాసన రావడంతో అపార్టుమెంట్ వాసులకు తెలియజేశారు. వారు లోపలికి వెళ్లి చూడగా రామ్మోహన్‌రావు కింద పడిపోయి ఉన్నాడు. అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న సిబ్బంది పరీక్షించగా అప్పటికే ఆయన మృతిచెంది ఉన్నాడు. ఈ మేరకు మృతుడి బావమరిది రమేష్ పేట్ బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు రామ్మోహన్‌రావు (ఫైల్)

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

హయత్‌నగర్, మే 19(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం తుర్కయంజాల్‌లోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ హాజరై సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ఆయన చిన్నతనం నుంచే అంటరానితనం, వెట్టి చాకిరికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేశాడని గుర్తు చేశారు. నేడు దేశానికి సుందరయ్య లాంటి నాయకుడు, నాయకత్వం అవసరం ఉందన్నారు. యువత సుందరయ్య ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకుడు అరుణ్‌కుమార్, శంకరయ్య, మాధవరెడ్డి, అంజయ్య, కుమార్, యాకయ్య, నాంపల్లి శంకర్, పరమేశ్, శేఖర్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

జైపురికాలనీలో..

మన్సూరాబాద్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, స్వాతంత్ర్య సమరంలో తనదైన శైలిలో పోరాటం చేయడంతో పాటు కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన మహాయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్, ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పేర్కొన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని నాగోల్ డివిజన్ జైపురికాలనీ బస్టాప్ వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. చెన్నారం మల్లేశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆలేటి ఎల్లయ్య, చింతపల్లి కృష్ణయ్య, ఆరుట్ల మల్లేశం, చైతన్య పాల్గొన్నారు.

బైరామల్‌గూడలో...

చంపాపేట: బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్డులో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సీపీఎం ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు చంద్రమోహన్, నాయకులు రవీందర్, రామస్వామి, దుర్గారావు, యాదయ్య, కాశయ్య, లక్ష్మయ్య, రాధమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పిస్తున్న సీపీఎం నాయకులు


నాగోల్ జైపురికాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నినాదాలు చేస్తున్న చంద్రమోహన్, కీసరి నర్సిరెడ్డి


బైరామల్‌గూడ సాగర్‌రింగ్ రోడ్డులో పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు